అనుకోకుండా వచ్చిన ఆస్తి అతని పరువు ఎలా తీసింది?

**పెనుమాక నాగేశ్వరరావు కథ**

# ఉక్రోషం

గత మూడు రోజులుగా జోరున వర్షం. వీధులన్నీ నిర్మానుష్యంగా వుంటున్నయ్. వాన నీరు ప్రవాహంలా పారుతున్నది రోడ్లమీద. పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయిపోయినై.

అంత వాన కురుస్తున్నా వూసుపోక దుకాణాలు తెరుచుకుని నిస్సహాయంగా చూస్తూ కూర్చున్నారు వ్యాపారస్థులు. వాన కారణంగా బడులు తెరవకపోవటంతో ఇళ్ళల్లోనే సందడి సృష్టిస్తున్నారు పిల్లలు. ఎండయినా వానయినా ఆకలితప్పదు. ఆడంగులంతా తమ వంట కార్యక్రమాల్ని యథావిధిగా చేసుకుంటున్నారు. ఆ వర్షంలోనే అవస్థలు పడుతూ ఆఫీసులకు వెళ్ళక తప్పటం లేదు శెలవల్లేని వుద్యోగులకు. చలపతికూడా అలాగే గత మూడు రోజులు ఆఫీసుకు వెళ్ళాడు. తెల్లవారితే ఆదివారం. ఆఫీసుకు వెళ్ళాల్సిన పనిలేదు. అందువలన త్వరగా నిద్రలేవక పోయినా పరవాలేదు. పైగా వర్షం. ఈదురుగాలి. నిద్రలేచినా ముసుగుతీసి మంచం దిగటానికి బద్ధకం. తను లేవకపోగా భార్యను కూడా లేవనీయకుండా ఆమెను మరింత దగ్గరకు లాక్కుని వెచ్చగా, మత్తుగా పడుకున్నాడు చలపతి.

వీధి తలుపు ఎవరో తట్టినట్లు శబ్దం.

"ఈ వర్షంలో ఇంత ఉదయాన్నే ఎవరో" విసుక్కున్నాడు.

గంట క్రితమే పాలవాడు వచ్చివెళ్ళిపోయాడు. మామూలు రోజుల్లోనే ఏడు గంటలగ్గానీ రాని పనిమనిషి అప్పుడే రావటం అసంభవం.



మరోసారి తలుపు చప్పుడయింది.

"ఈ చలిలో ఆ నాలుగు చినుకులు తలమీద పడాల్సిందే. తలుపు తెరవాల్సిందే" విసుక్కుంటూ వెళ్ళి తలుపు తెరిచాడు చలపతి.

"ఎవరు కావాలి" అడిగాడు చలపతి.

"చలపతంటే నువ్వేనా"

అతని ఏకవచన సంబోధన

ఆశ్చర్యపరిచింది చలపతిని.

"మీరెవరు" సంకోచంగా అడిగాడు.

"మీ నాయనపేరు శ్రీరాములేకదూ"

"అవును... మీరు."

"మీది గన్నెముక్కల."

'గన్నెముక్కల'... ఆ పేరు ఎప్పుడో విన్న స్పురణకు వచ్చింది చలపతికి.

"ఎవరికోసం వచ్చారు."

"నీతోనే పనుండొచ్చాను. లోపలికి పద సెప్తా" అంటూ తన ప్రమేయం లేకుండానే లోపలికి వచ్చేశాడా వ్యక్తి.

"నీ అడ్రస్సు తెలుసుకునేసరికి నా తల ప్రాణం తోక్కొచ్చింది. అసలెప్పట్నుంచో నీకాడికి రావాలనుకుంటుంటే ఇయ్యాల కుదిరింది."

'అతని వూరు గన్నెముక్కలయితే కావచ్చు. ఆ వూరికి తనకి ఎలాంటి సంబంధం లేదు. ఆ వచ్చిన వ్యక్తికి తనకి సంబంధం వుండటానికి అంతకంటే వీల్లేదు'. ఆలోచిస్తున్నాడు చలపతి.

"ఏం పనిమీద వచ్చారు" అడిగాడు చలపతి.

"నీతో చాలా సంగతులు చెప్పాలయ్యా" అంటూనే కుర్చీలో చతికిలపడ్డాడు సదరు అపరిచితుడు.

పూర్తిగా తెల్లవారినా, వాన ప్రభావంతో చీకటిగానే వున్నది. లైటువేసి తనూ ఓ కుర్చీలో కూర్చున్నాడు చలపతి.

'అయ్యా నా పేరుగద సూరయ్య. మా వూరు గన్నెముక్కల అని సెప్పాగదా. ఇకపోతే ఆ వూర్లో మీకో పది సెంట్ల స్థలం వుంది. అది మా స్థలానికి ఆనుకునే వుంది. అది కూడా కలుపుకుని ఇల్లు కట్టించాలనే ఆలోచిస్తూ నీ దగ్గరికి వచ్చాను" చెప్పేడు సూరయ్య.

అంతలోనే రెండు కప్పుల్తో కాఫీ తెచ్చిచ్చింది చలపతి భార్య. అసలే వాతావరణం చలచల్లగా వున్నదేమో పొగలు కక్కుతున్న కాఫీ చూడగానే ప్రాణం లేచివచ్చినట్లనిపించి తనో కప్పు తీసుకుని సూరయ్యకు ఓ కప్పు అందించాడు.

ఎవరి స్థలంలోనో చెప్ప చెయ్యకుండా ఇళ్ళు కట్టుకుని తర్వాత ఏం చేసుకుంటావో చేసుకో పొమ్మంటున్న ఈ రోజుల్లో ఫలానా వూర్లో నీకు స్థలం వుంది. అది నేను కొంటాను అని చెప్పటానికి ఇల్లు వెతుక్కుంటూ వచ్చి మరీ చెప్పటం చలపతికి అనుమానంగానూ, ఆశ్చర్యంగానూ అనిపించింది.

'రోజూ పేపర్లో అనేక వింత వార్తలు చూస్తున్నాం. రకరకాల మోసాలు జరుగుతున్నాయి. ఇదొక రకం మోసమేమోననిపించిందతనికి. అన్యాయాలమధ్య అక్రమాలమధ్య బతుకుతున్న మనిషికి నిజాయితీ, నీతి ఎదురైతే అనుమానించడం, అవమానించడం సహజమైపోయింది.

ఆలోచనలమధ్య కాఫీ కప్పు ఖాళీ చేసేశాడు చలపతి.

"ఏమండీ... ఓ సారిలా వస్తారూ" పిలచింది శ్రీమతి.

ఖాళీ కప్పు చేత పట్టుకుని లోపలికి నడిచాడతను.

"ఎంత ధర వుంటుందో ఏమిటో

కనుక్కుని, అవసరం అయితే ఒకసారి ఆ వూరువెళ్ళి వద్దురుగాని. ధర ఇంకా ఎక్కువ వుంటుందేమో కనుక్కుందురు. అంతేగాని తొందరపడి అతనికి మాటిచ్చేయకండి'' హెచ్చరింపుగా అన్నది శ్రీమతి.

ఆవిడ సలహాకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదతనికి. అరగంట క్రితంవరకు అసలా వూళ్ళో తమకు ఓ జానెడు స్థలం వున్నట్లు కూడా తెలీదు. ఆ విషయం నిజమో కాదో ఇప్పటికీ అనుమానమే.

అప్పుడే ధరలు, విచారణల వరకూ వెళ్ళినై ఆవిడగారి ఆలోచనలు.

'మనిషి బుద్ధే అంత. అసలు 'లేదు' అనుకున్నదానికి ఎంతవస్తే ఏమిటో' అనుకున్న చలపతి ''అలాగే'' అన్నాడు ఆమె సూచనకు బదులుగా.

వెంటనే సూరయ్యకు ఏం చెప్పాలో అంతుపట్టలేదు చలపతికి. ఉన్న ఫళంగా ఎటువంటి నిర్ణయం తీసుకోవడం మంచిది కాదనుకున్నాడు. ఆ స్థలాన్ని గురించిన పూర్వాపరాలు తెలుసుకునిగాని ఏ విషయం నిర్ధారణ చేసుకోకూడదనుకున్నాడు.

బయటకు వచ్చి సూరయ్య ఎదురుగా కూర్చున్నాడు చలపతి.

''మీ తాతగారి హయాంలోది బాబు ఆ స్థలం. మీ నాన్నగారి అన్నదమ్ములందరికి చెల్లుతుంది. ఆరంతా ఇప్పుడు ఎక్కడెక్కడ వుంటున్నారో తెలువదు. నీ ఒక్కడి అడ్రసు అతి కష్టంమీద కనుక్కోగలిగేను. నీవొక్కడివీ సంతకం సేస్తే చాలు. మిగిలిన వ్యవహారం నేసూసుకుంటా'' అన్నాడు సూరయ్య.

ఇదేదో పెద్ద వ్యవహారం అనిపించింది చలపతికి. ''సరే... అయితే నేనొకసారి ఆ వూరు వస్తాన్లే. అప్పుడు మాట్లాడుకుందాం'' అన్నాడు.

''బాబ్బాబు అలా అనకండి. ఇక ఆలస్యం జరగటానికి వీల్లేదు. ఇప్పటికే ఎంతో జాగయిపోయింది. మీరు వెంటనే ఏ విషయం చెప్పాలి'' అన్నాడు సూరయ్య.

అతనలా మాట్లాడేసరికి రకరకాల అనుమానాలు కలిగినై చలపతికి.

''మా వాళ్ళందర్తో మాట్లాడాలి కదా మరి'' అసహనంగా అన్నాడు.

''బాబూ ఇంతదాకా వచ్చాక ఇక అసలు విషయం దాచటం కూడా నాకు ఇష్టంలేదు. అంతావున్నది వున్నట్టు చెప్పేస్తాను. అంతా



## మంచి

''అదేమిటో... వాడింది మంచి సిమెంటే... కానీ అప్పుడే గోడలకు పగుళ్లు వచ్చాయి'' అర్థంకాక అన్నాడు ఇంటి యజమాని కామేశం..

''సిమెంట్ మంచిదైతే సరిపోదు. కాంట్రాక్టర్ మంచివాడయి వుండదు'' అన్నాడు ఆనందం.

—ఎం.డి.హాఫియొద్దీన్ (గోశెటి టౌన్‌షిప్)

విన్నాక మీ ఇష్టం వచ్చినట్లు చేయండి'' అన్నాడు సూరయ్య.

దొంకకదుల్తున్నట్లు అనిపించింది చలపతికి. కుర్చీలో ముదుచుకూర్చుని ముందుకు వంగేడు చెప్పబోయే విషయాన్ని జాగ్రత్తగా వినేందుకు. చలపతి భార్య సీత కూడా అక్కడే గోడనానుకుని కూర్చుంది.

''బాబు మా స్థలం దక్షిణంవైపు నుంది. దాన్నానుకుని ఉత్తరం వైపుని మీ పదిసెంట్లు. దాని వెంబడే మీ బంధువులాయన్దే ఓ ఎనిమిది సెంట్లు వుంది. ఆయన పేరేదో పుల్లయ్యగారంట. ఆయనగారి స్థలం పక్కనే మా అన్నయ్యగారి ఇల్లుంది. అదో పెంకుటి భవంతి. దాన్ని పడగొట్టేసి మంచి డాబా ఇల్లు కట్టించాలని ఆయనగారి ఆలోచన. అందుకోసం పక్కనున్నమీ రెండు స్థలాలు కలుపుకోవాలని ఆయన కోరిక. ముందుగా పుల్లయ్యగారి దగ్గరకు వెళ్ళాడు మా అన్న. నాకు రెండు స్థలాలు కలుపుకునే శక్తిలేదు. మీ ఒక్కరి స్థలం కలుపుకుని నేనూ డాబా కట్టించాలనే ఆలోచనల్లో వున్నాను. అందుకోసం నేను తొందరపడుతున్నానే కాని, ఇందులో మిమ్మల్ని మోసం చేయటంగాని, మీకు అన్యాయం చేయటంగాని ఏమీలేదు...''

ఒక్కొక్క విషయమే తెలుస్తున్నకొద్దీ ఆసక్తి పెరుగుతున్నది చలపతికి.

పుల్లయ్య పేరు వినపడగానే దూరపు బంధువు ఒకాయన గుర్తొచ్చాడు. ఆయన్తో పెద్దగా పరిచయం లేదు చలపతికి.

''ఎంత రేటుందేమిటి'' అడిగాడు చలపతి.

''రేటంటే సెంటు పన్నెండువందల చొప్పున ఈ మధ్యనే బేరాలు కుదుర్చుకున్నారు బాబు...''

......

''పల్లెటూరుగదా. ధరలు మీ బస్తీలోకి మల్లే వుండవు మరి. అదే ఈ టవున్లో అయితే సెంటు పన్నెండువేలకే కొనిపారేస్తారు. అక్కడట్లా కాదుకదా'' అని ఇకిలించాడు సూరయ్య.

''సెంటు పన్నెండువందలు. అంటే పదిసెంట్లు పన్నెండువేలు.... అనుకోకుండా పన్నెండువేల ఆకస్మిక ధనలాభం'' అని మనసులోనే లెక్కలు వేసుకుని మురిసిపోయింది చలపతి భార్య.

అతనంతట అతనే పన్నెండు వందలు చెప్పేడంటే ఇంకా ఎక్కువ ధరే వుండి వుంటుంది. చెప్పినదానికి తలవూపకుండా బేరం మొదలుపెట్టాలి. బెట్టుచూపిస్తే బేరం పెరుగుతుంది' మనసులోనే అనుకున్నాడు చలపతి.

''ఏం బాబు.... మీరు సరేనంటే అడ్వాన్సుగా ఆరేలు ఇప్పుడిచ్చేత్తా... కొదమా కురవ మొత్తం రెండు మూడు రోజుల్లో పట్టుకొచ్చేత్తా ఆ రోజే రిజిస్ట్రేషను పనికూడా పూర్తిచేసుకుంటామరి'' అనునయంగా అన్నాడు సూరయ్య.

....

''ఏంటి బాబూ ఆలోచిత్తన్నావ్. ఇందులో నిన్ను నే మోసం చేత్తన్నది ఏం లేదు. ధర కూడా నేనే ఎక్కువ పెడతన్నా.

ఎందుకో తెల్సా. మా అన్న కంటె ఒక పాతిక ఎక్కువ పెట్టయినా సరే నేనే మీ స్థలాన్ని కలుపుకోవాలని నా పట్టుదల. ఆదు సెంటు పదకొండు వందలకంటే ఎక్కువ పెట్టనని సెప్తున్నాడంట వుర్లో మరి నేనాడికంటే ఎకాయెకిన వంద ఎక్కువ పెట్టేత్తన్నా.''

''అన్ని నేనే సెప్తన్నాగాని మీరు ఒక్క మాటన్నా మాట్లాట్టంలేదాయె. నేనేం మోసం సేయటం లేదుసామి. నా అవుసరం గాబట్టి మా అన్నకి నాకు పోటీ వచ్చి నేను లగెత్తుకుంటూ మీకాడికి లగెత్తుకొచ్చేశానంతే. అన్నాడు సూరయ్య.

'చూడు సూరయ్యా ఎటూ రెండు మూడు రోజుల్లో మళ్ళీ వస్తానంటున్నావు కదా. అప్పుడే మొత్తం డబ్బు తీసుకుంటాను. ఆ రోజే రిజిస్ట్రేషన్ పనికూడా పూర్తిచేద్దాం... ఇప్పుడు అడ్వాన్సు ఏమీవద్దు.... అయితే ఆ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషనుక్కావలసిన ఏర్పాట్లు నువ్వే చూసుకోవాలి'' హెచ్చరింపుగా అన్నాడు చలపతి.

''అయెన్ని నేను చూసుకుంటానుగాని బాబు, మళ్ళీ నువ్వు మాత్రం మనసు మార్చుకోకూడదు'' అంటూ చలపతి చేతినందుకుని తడిమాడు సూరయ్య.

'అలాగే' అంటూ ఓ చిరునవ్వు నవ్వేడు చలపతి.

''అందుక్కాదు బాబు. రేపో మాపో మల్లా మా అన్నొచ్చి నాకాడికి ఇంకో అయిదో, పదో ఎక్కువ ధర ఇత్తానన్నాడనుకో. నీకటు మనసు పోవచ్చు కదా...... డబ్బు కదా బాబు... అందుకే అడ్వాన్సు తీసుకోమంటున్నా'' బతిమాలుతున్నట్లు అన్నాడు సూరయ్య.

''నీకా భయం ఏమీ అక్కరలేదు. వెళ్ళిరా. మీ అన్న పదికాదు, పాతిక ఎక్కువ ఇస్తానన్నా అతనికి అమ్మను. ఆ స్థలం నీకే అమ్మేస్తాను వెళ్ళిరా'' చెప్పేడు చలపతి.

''అలాగే బాబు... వెళ్ళొత్తా... అమ్మా నే మల్లా వత్తా'' అని చెప్పి వెళ్ళిపోయాడు సూరయ్య.

అతనికి అలా మాట ఇవ్వటంపై చలపతికి అతని భార్యకు కాసేపు వాగ్యుద్ధం



## దురదపుట్టించే చెట్టు

దీవుల్లోని ప్రజల అలవాట్లు అక్కడ దొరికే వనరుల ఆధారంగానే వుంటాయి. చిన్న చిన్న ముళ్ళున్న కివ్వోల్ చెట్టు మట్టల్ని కొబ్బరి కాయలు చెక్కడానికి ఉపయోగిస్తారు. అయితే అక్కడ లభించే పన్‌రూల్ అనే చెట్టు చాలా ప్రమాదకరమయినదట! దాని పళ్లు చింతగింజల్లా వుండి మృదువైన సన్నని నూగు కలిగి వుంటాయట! అది మన శరీరానికి తగిలితే చాలు విపరీతమైన దురద పుడుతుంది.

జరిగింది. ఒకొర్నొకరు తప్పులు పట్టుకున్నారు.

'పొలం గట్లదగ్గర, స్థలాల హద్దుల ధగ్గర సొంత అన్నదమ్ములే పొడుచుకు చంపుకుంటున్న వార్తలు ఎన్ని వినటం లేదు. కొంపతీసి ఈ సూరయ్య తన అన్నతో కూడా ఇలానే పోట్లాడుకుని పొడుచుకు చస్తారేమో'. ఈ ఆలోచన రాగానే మనసంతా పాడయింది చలపతికి.

'నిజమే వారలా చేస్తే ఆ పాపంలో తనకీ భాగం వుంటుంది. ఇద్దర్నీ ఓచోట చేర్చి సామరస్యంగా సమస్యని పరిష్కరిస్తే ఎటువంటి ఉపద్రవం జరక్కుండా వుంటుందేమో' మనసులో ఆలోచన్ని భార్యతో చెప్పాడు చలపతి.

''బాగానే వుందిలేండి. మీా ఆలోచన. వాళ్ళేదో గొడవ పెట్టుకుని కొట్టుకు చస్తారని మనం తలదూర్చటం ఎందుకు. వాళ్ళ తగవులకు మనకు ఏమిటి సంబంధం. ఎవరు ఎక్కువ రేటుకు కొంటే వాళ్ళకు అమ్ముతానని చెప్పాలి మీారు. అంతే'' మళ్ళీ మొదటికి వచ్చిన భార్యను అసహ్యంగా చూశాడు చలపతి.

''అన్నదమ్ములమధ్య పోటీ వచ్చిందికదాని వారిమధ్య పంతాల్ని పట్టింపుల్ని ఇంకా పెంచి పోషించి, తద్వారా ఎక్కువ డబ్బు సంపాయించటం నాకు ఇష్టం లేదు. అంతే'' సూటిగా చెప్పేశాడు చలపతి.

పెదవి విరుస్తూ లోపలకి నడిచింది అతని భార్య. 'ఈ కారణంగా వాళ్ళు కొట్టుకు చావకుండా వుంటే అంతేచాలు' అని మనసులోనే అనుకొన్న చలపతికి ఆ వ్యవహారం ద్వారా తనకే అపకారం జరగబోతున్నదని గాని, తను మరి కాస్త తెలివిగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని కాని తెలుసుకోలేకపోయాడు పాపం చలపతి.

ఆ మర్నాడే సదరు సూరయ్య సోదరుడు సుబ్బయ్య వచ్చాడు చలపతి దగ్గరకు. తను సూరయ్యకంటే మరో పాతిక రూపాయలు ఎక్కువ ధరకు కొంటానన్నాడు స్థలాన్ని.


చలపతికి మనసు అంగీకరించలేదు. సూరయ్యకు ఇచ్చిన మాట తప్పటం ఇష్టం లేకపోయింది తనకి. అందుకే తన అయిష్టతని స్పష్టంగా తెలియచేశాడు. ఆ స్థలాన్ని సూరయ్యకే అమ్ముతానని గట్టిగా చెప్పేశాడు చలపతి. ఎన్నో రకాలుగా అతన్ని ఒప్పించేందుకు విఫలయత్నం చేసిన సుబ్బయ్య ఓడిపోక తప్పలేదు. సూరయ్యకు ఆ స్థలం దక్కుతున్నందుకు వుక్రోషంగా వున్నదతనికి. ఎటువంటి పరిస్థితుల్లోనూ చలపతి మనసు మార్చటం కుదరదని తెలుసుకున్న సుబ్బయ్య అసహాయంగా తిరిగి వెళ్ళిపోయాడు. తను చేయవలసిన కార్యక్రమాన్ని మనసులో రూపకల్పన చేసుకున్నాడు. చలపతిని ఎలా దెబ్బ తీయాలో నిర్ణయించుకున్నాడు.


మూడోరోజుకల్లా సూరయ్య స్థలం కొనటానికా్కవలసిన డబ్బు, కాగితాలు వగైరాలన్నీ తీసుకుని వచ్చాడు. రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తయింది. సూరయ్య కృతజ్ఞత తెలియచేసి వెళ్ళిపోయాడు.

'వచ్చిన డబ్బుతో తనతోపాటుగా భాగం

పంచుకోవలసిన కజిన్స్‌కూడా వారి వాటాల్ని పంపించేశాడు చలపతి. వారికి ఈ వివరాలన్నీ తెలియకపోయినా, వారు సంతకాలు వేయకపోయినా, డబ్బుకు తను కక్కుర్తిపడకుండా వారి వాటాల్నివారికి పంపించి తన వాటాగా మిగిలిన సొమ్ముని బ్యాంకులో వేసుకున్నాడు చలపతి.

సరిగ్గా ఆ సంఘటన జరిగిన దగ్గర్నుంచీ చలపతికి బంధువుల్తో సత్సంబంధాలు తెగిపోయాయి. అప్పటివరకు ఆప్యాయంగా పలుకరించి, పరామర్శించే వారంతా అంటీ ముట్టనట్లు, ముభావంగా, ముక్తసరిగా మసలడం ప్రారంభించారు. కారణం తెలియలేదు చాలాకాలం వరకు చలపతికి.




కాల క్రమేణా ఆనోటా ఆనోట విని చలపతి తెలుసుకున్న విషయం ఏమిటంటే ఆ స్థలం విషయంగాని, ధర విషయంగాని అమ్మటానికి ముందరే తను వారికి ఎందుకు తెలియచేయలేదని; తను ఎంత ధరకు అమ్మి వారికి ఎంత ముట్ట చెప్పేడోననే అనుమానం బంధువుల్లో వున్నదని తెలుసుకున్నాడు చలపతి.

అయితే ఏం లాభం. తనిప్పుడు జరిగిన విషయాన్ని వివరించినా లాభం లేదు. అనుమానం అనేది రానేకూడదు. వచ్చాక దాన్ని లేకుండా చేయటం అసాధ్యం. అందుకే నిర్లిప్తంగా వూరకుండిపోయాడు చలపతి.

"మీ అన్నయ్య చలపతి, మా అందరికీ సంబంధించి గన్నె ముక్కల గ్రామంలో వున్న మా స్థలాన్ని ఇరవై ఆరువేలకు అమ్మి పన్నెండువేలకే అమ్మినట్లు కాయితాలు వ్రాసుకొని అమ్మాడు. మా అందరికీ ఆ పన్నెండు వేలల్లోనే వాటా ఇచ్చి తను మాత్రం మిగతా మొత్తాన్ని సొంతం చేసుకున్నాడు. గ్రహించగలరు"

మీ శ్రేయోభిలాషి

అని సుబ్బయ్య తన వుక్రోషం కొద్దీ వ్రాసిన ఉత్తరమే చలపతిని దోషిగా మార్చిందని, తన బంధువులందరికీ విరోధిగా మారటానికి కారణం సుబ్బయ్య అనీ, తన వుక్రోషాన్ని సుబ్బయ్య ఇలా తీర్చుకున్నాడని పాపం చలపతికి తెలియదు.



డిజైన్: ఆర్.సత్యవతి (విల్లివాకం)